నూతన సంవత్సరంలో 'నామినేటెడ్' జాతర

❖ రెండేళ్ల నిరీక్షణకు శుభం కార్డు

దశ న్యూస్ ఆందోల్: తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త ఏడాది సరికొత్త సందడిని మోసుకొస్తోంది. ప్రభుత్వం ఏర్పాటై రెండు ఏళ్లు గడుస్తున్న తరుణంలో, నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్న ఆశావాహుల నిరీక్షణకు తెరపడనుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్పొరేషన్లు, బోర్డులు, కమిటీల్లో ఖాళీగా ఉన్న వందలాది పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ 'నామినేటెడ్ జాతర'తో ద్వితీయ శ్రేణి నాయకత్వంలో నూతనోత్సాహం నింపడమే లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి.

నిరీక్షణకు లభించనున్న ప్రతిఫలం

గత ఎన్నికల సమయంలోనూ, ఆ తర్వాత పార్టీ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన నాయకులు చాలా కాలంగా పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో పాలనపై దృష్టి సారించడం, ఆపై ఆర్థిక సమీకరణల వల్ల నామినేటెడ్ పోస్టుల భర్తీ ఆలస్యమవుతూ వచ్చింది. అయితే, నూతన సంవత్సర కానుకగా ఈ పెండింగ్ ఫైళ్లకు మోక్షం కల్పించాలని అధిష్టానం నిర్ణయించింది.

భర్తీ కానున్న కీలక పోస్టులు ఇవే..

రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పే కీలక కార్పొరేషన్లతో పాటు జిల్లా స్థాయి కమిటీలను కూడా ఈ దఫా భర్తీ చేయనున్నారు.రాష్ట్ర స్థాయి కార్పొరేషన్లు లో సివిల్ సప్లైస్, ఆర్టీసీ, హౌసింగ్ బోర్డ్, పారిశ్రామికాభివృద్ధి సంస్థ , పర్యాటక అభివృద్ధి సంస్థ వంటి కీలక పదవులు. దేవాలయ కమిటీలో భాగంగా యాదాద్రి, వేములవాడ వంటి ప్రముఖ ఆలయాల ట్రస్ట్ బోర్డుల నియామకం.జిల్లా స్థాయిలో గ్రంథాలయ సంస్థలు, మార్కెట్ కమిటీలు మరియు డీసీసీబీ పాలక మండళ్లు వంటి పదవులు దక్కనున్నాయి.

సామాజిక సమీకరణాలే ప్రామాణికం

ఈ నియామకాల్లో కేవలం విధేయతకే కాకుండా సామాజిక సమీకరణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు మైనారిటీ వర్గాలకు సముచిత స్థానం కల్పించడం ద్వారా రాబోయే ఎంపీటీసీ , జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో మైలేజ్ పొందాలనేది వ్యూహం. మహిళా కోటాకు కూడా పెద్దపీట వేయనున్నట్లు సమాచారం. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పనిచేసిన వారికి గుర్తింపు దక్కే సమయం వచ్చింది. ఇది కేవలం పదవుల పంపిణీ మాత్రమే కాదు, ప్రజలకు సేవ చేసే బాధ్యతను అప్పగించడం కూడా అని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఆశావాహుల్లో పెరిగిన ఉత్కంఠ

ఏడాది ముగుస్తున్న తరుణంలో జిల్లాల వారీగా జాబితాలు ఇప్పటికే సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. గాంధీ భవన్ నుంచి ప్రగతి భవన్ వరకు అభ్యర్థుల పైరవీలు, సిఫార్సుల హోరు పెరిగింది. ఎవరికి ఏ పదవి దక్కుతుందో అన్న ఉత్కంఠ పార్టీ వర్గాల్లో నెలకొంది. మొత్తానికి ఈ నూతన సంవత్సరం తెలంగాణలో రాజకీయ నియామకాలతో సందడిగా గడవనుంది.

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఓటర్ లిస్టును సవరించాలి

❖ బిఆర్ఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కొని రాజు

దశ, ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని ఓటర్ లిస్ట్ సరి చేయకుంటే రానున్న ఎన్నికలు బహిష్కరణ చేస్తామని బీఆర్ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు జెర్కొని రాజు డిమాండ్ చేశారు. సోమవారం అయన మున్సిపాలిటీ లోని వివిధ వార్డులలో ఓటర్ల మార్పు చేర్పులు జరిగిన తప్పిద్దాలు సరిచేయాలనీ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని ఓటర్ లిస్ట్ ను వెంటనే సరి చేయాలి. సరి చేయకుంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి మడుపు వేణుగోపాల్ రావు, సుల్తాన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి. రాజ్ కుమార్, మాజీ కౌన్సిలర్ నీలం స్వేత, మంద సుధాకర్, ఆకుల సురేష్, కసరమోని మల్లేష్, శంకర్ నాయక్, కొంద్రు ప్రవీణ్, మడుపు గోపాల్, కొత్త గణేష్ గౌడ్, వార్డు అధ్యక్షులు సోప్పరి కరుణాకర్, కర్నె అరవింద్, నౌస్ శివ, కానుగుల మహేష్, దయచారి, శ్రవణ్, త్రిలోక్, మనిష్, మహేష్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడిగా బూత్కూరి వెంకటరెడ్డి

దశ నడిగూడెం : మండలం లోని గ్రామాల సర్పంచ్ ల సమస్యల పరిష్కారానికి చోరవ చూపుతానని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా ఎన్నికైన భూత్కూరి వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయం నందు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులతో నిర్వహించిన సమావేశంలో రామాపురం సర్పంచ్ భూత్కూరి వెంకటరెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ లకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను రాష్ట్ర మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినందుకు సర్పంచ్ అందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు వెంకటరెడ్డిని సర్పంచ్ లు శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు దున్నా శ్రీనివాస్, గోసుల రాజేష్,దాట్ల నాగేశ్వరరావు,పాటిబండ్ల వెంజటేశ్వర్లు,వేల్పుల సోమయ్య,కంభంపాటి సరిత,అట్టూరి పుష్పావతి,చిర్రా రమ్య,దొడ్డి నరసింహారావు, విమలపంగు సరోజిని, ధారావత్ వరలక్ష్మి,కేశగాని సరిత. లు పాల్గొన్నారు.

నవ మహిళా సాధికార కేంద్రంలో చెక్కుల పంపిణీ

దశ, భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ నవ లిమిటెడ్ సామాజిక కార్యక్రమాలలో భాగంగా ఏర్పాటు చేసిన నవ మహిళా సాధికార కేంద్రంలో తాటి ఆకుల కళాకృతులు విక్రయించడం, యూనిఫామ్స్ కుట్టడం ద్వారా వచ్చిన రూ.1,21,600 నగదును చెక్కు రూపంలో రమా దేవినేని సోమవారం మహిళలకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రమా దేవినేని మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుడాలని ఆ కుటుంబం ఎప్పుడూ ఆనందమయంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అరుణ, దివ్య విద్యార్థులు పాల్గొన్నారు.

హైదరాబాదు డి అడిక్షన్ సెంటర్లో యువకుడి మృతి

❖ మృతి పట్ల అనేక అనుమానాలు

దశ, ఆదిభట్ల: సకల సౌకర్యాలు కల్పించి వ్యసనాలకు గురైన వారిని మార్చుతామని హామీ ఇచ్చిన ఓ డి అడిక్షన్ సెంటర్ లో అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని బొంగులూరు లో గల హైదరాబాద్ డి అడిక్షన్ సెంటర్లో ఆదివారం మిర్యాలగూడ విద్యానగర్ కు చెందిన సింగ్ (28)అనే ఓ యువకుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్లు సమాచారం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అనేక అనుమానాలు

రెండు రోజుల క్రితం ఈ సెంటర్లో చేరిన యువకుడు మృతి చెందడం పట్ల అనేక అనుమానాలకు తావిస్తోంది. ఒళ్లంతా గాయాలతో కమిలిపోయి ఉందని, కాదా ఈ సెంటర్లోకి వచ్చే ముందే తుర్కయంజాల్ లోని మరో డి అడిక్షన్ సెంటర్లో చేర్పించినట్లు సమాచారం. అక్కడ మృతుడు గాయల పాలయ్యడ, ఇక్కడ గాయలపాలు అయ్యారన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. కాగా ఇటీవల పుట్టగొడుగుల్ల పుట్టుకొచ్చిన, అనుమతులు లేకుండా అర్హతలు లేకుండా కొనసాగిస్తున్న డి అడిక్షన్ సెంటర్ల నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మాలలు రాజకీయాల్లోకి రావాలి

❖ జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

దశ, భద్రాద్రి కొత్తగూడెం: మాలలు రాజకీయాల్లోకి వచ్చి రాజకీయాల్లో రాణించాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ)రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని కొమరం భీం భవన్ లో మాలల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఆర్ఎస్ఎస్ మతోన్మాద బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్రలు చేస్తుందని బీజేపీ ప్రభుత్వం త్వరలోనే ప్రజాస్వామ్యం స్థానంలో మనువాదాన్ని ప్రవేశ పెట్టడానికి ప్రయత్నం చేస్తోందని అదే జరిగితే 93 శాతం ఉన్న ప్రజలు గతంలో మాదిరిగా మళ్లీ బానిసలుగా మార్చే కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

మతోన్మాద విధానాలను అమలు చేయడానికి ఇచ్చే ప్రాధాన్యత ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఇవ్వడం లేదని దేశ సంపదను కొల్లగొట్టి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి ప్రాధాన్యత ఇస్తుందని విమర్శించారు. ఈదేశంలో మనల్ని కాపాడుకున్నది భారత రాజ్యాంగమేనని కానీ రాజ్యాంగం పైన అవగాహన లేక రాజ్యాంగం ద్వారా వచ్చిన హక్కులను తెలుసుకోలేక పోవడంవల్లనే మనువాదులు రాజ్యమేలుతున్నారని అణగారిన వర్గాల ప్రజలు ఏరోజైతే భారత రాజ్యాంగ విలువను ఓటు విలువను గుర్తిస్తారో ఆరోజు ఖచ్చితంగా రాజ్యాధికారాన్ని సాధిస్తారని మనువాదుల ఉచ్చులో పడకుండా ఈదేశానికి పాలకులవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాలల ఐక్య వేదిక కన్వీనర్ రిటైర్డ్ ఇంజనీర్ బరగడి దేవదానం, కోకన్వీనర్ సింగరేణి రిటైర్డ్ జీ.ఎం.శనగ వెంకటేశ్వర్లు, అడ్వకేట్ డి.శోభారాణి,

మాలమహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి శేఖర్, రమణమూర్తి, ఇన్నయ్య, రిటైర్డ్ మండల విద్యాశాఖధికారి ఫ్రాన్సిస్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ గుర్రం లక్ష్మయ్య, వి.శ్రీనివాస్ రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ బలరాం, ప్రిన్సిపాల్ దాసరి రమేష్, జూనియర్ లెక్చరర్ వరద ప్రభాకర్, రిటైర్డ్ ఉద్యోగులు శనగ స్వామి, గడ్డం రాఘనబాబు, వ్యాపారవేత్తలు ఇస్సాక్, ఉండేటి శాంతివర్ధన్, ప్రైవేట్ ఉద్యోగస్థులు ఎం.వి.రమణ, పంతగాని రాజశేఖర్, పోతురాజు బాబు, ఎస్.కమలాకర్, నామ ప్రసాద్, దుమల మధు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ మైండ్ పాఠశాలల క్యాలెండర్ ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ

దశ, ఎల్లారెడ్డిపేట :రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల,ఎల్లారెడ్డిపేట మాస్టర్ మైండ్ పాఠశాలల క్యాలెండర్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న సిగ్నేచర్ ప్రోగ్రామ్స్, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలపై పాఠశాల ప్రిన్సిపల్ లవీన్ జిల్లా ఎస్పీకి వివరించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, నైతిక విలువలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా మాస్టర్ మైండ్ పాఠశాలలు చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలను ఎస్పీ మహేష్ బి. గితే ప్రశంసించారు.విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇస్తూ, భవిష్యత్తు పౌరులను తీర్చిదిద్దే విధంగా పాఠశాలలు ముందుకెళ్లడం అభినందనీయమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల క్లస్టర్ ప్రిన్సిపల్ మామిడాల శ్యామ్ సుదేష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం ఆశగా ఎదురుచూస్తూనే నేలకొరిగిన దళిత రైతు..

❖ రావులపల్లిలో కన్నీటి విషాదం

❖ న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు ఆందోళన

దశ,తుంగతుర్తి: భూమిని నమ్ముకున్న రైతుకు ఆ భూమే ప్రాణం. ఆ ప్రాణ సమానమైన మట్టి చేజారిపోతుందన్న ఆవేదన ఆ నిరుపేద గుండెను బద్దలు కొట్టింది. న్యాయం జరుగుతుందన్న ఆశతో అధికారుల ముందుకు వచ్చిన ఓ సన్నకారు రైతు, విచారణ జరుగుతుండగానే ఊపిరి వదిలిన హృదయ విదారక ఘటన సూర్యాపేట జిల్లా, తుంగతుర్తి మండలంలోని రావులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటన వ్యవస్థ పనితీరుపై సామాన్యుడికి ఉన్న నమ్మకాన్ని ప్రశ్నిస్తోంది.

కష్టార్జితం కరిగిపోతుంటే..

రావులపల్లి గ్రామానికి చెందిన షెడ్యూల్డ్ కులాల (మాల) వర్గానికి చెందిన జోగునూరి లాజరస్, రెక్కల కష్టాన్ని నమ్ముకున్న నిరుపేద రైతు. 2007లో కేతిరెడ్డి విజయసేనారెడ్డి నుండి 11 ఎకరాల భూమిని కొనుగోలు చేసి, నాటి నుండి అందులోనే స్వేదాన్ని చిందిస్తూ సేద్యం చేసుకుంటున్నారు. ఆ భూమే ఆ కుటుంబానికి జీవనాధారం. అయితే, ఇటీవల ఆ రైతుకు కనీస సమాచారం గానీ, ముందస్తు హెచ్చరికలు గానీ లేకుండానే.. అందులోని 2 ఎకరాల 20 గుంటల భూమి రికార్డులు మారిపోయాయి. విజయసేనారెడ్డి భార్య సౌజన్య దేవి, ఆమె కుమార్తెల పేరిట పట్టా బదలాయింపు జరిగిపోయింది. తనకు తెలియకుండానే తన భూమి పరాయి పాలైందన్న వార్త ఆ రైతును తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం స్థాయిలో జరిగిన ఈ అన్యాయంపై ఆ రైతు మనసు విలవిలలాడింది.

న్యాయం కోసం చూసి.. నిరాశతో నేలకొరిగి..

తన గోడును వెళ్లబోసుకోవడానికి, న్యాయం దక్కించుకోవడానికి జనవరి 2న తహసీల్దార్ కార్యాలయం మెట్లెక్కారు. సోమవారం ఉదయం గ్రామ పంచాయతీ ఆవరణలో పోలీసు అధికారుల (సీఐ నరసింహారావు) సమక్షంలో ఈ సమస్యపై విచారణ మొదలైంది. ఒకవైపు కోల్పోతున్న భూమి, మరోవైపు అధికారుల ప్రశ్నలు.. ఆ పేద రైతు మనసుపై పెనుభారాన్ని మోపాయి. న్యాయం కోసం పరితపిస్తున్న ఆ గుండె, ఒత్తిడిని తాళలేక ఒక్కసారిగా ఆగిపోయింది. అధికారుల కళ్లెదుటే కుప్పకూలిపోయిన లాజరస్, ఆసుపత్రికి చేరేలోపే అనంతలోకాలకు వెళ్లిపోయారు.

ప్రభుత్వం కన్నీళ్లు తుడవాలి..

ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన ఆ దళిత కుటుంబం రోదనలు గ్రామస్తులను కంటతడి పెట్టిస్తున్నాయి. మృతదేహాన్ని సౌజన్య దేవి ఇంటి ముందు ఉంచి తమకు న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వేడుకుంటున్నారు. చట్టాలను, నిబంధనలను పక్కనపెట్టి, ఒక పేదవాడి భూమిని అన్యాక్రాంతం చేయడంలో బాధ్యులైన రెవెన్యూ, పోలీసు అధికారుల (తహసీల్దార్ దయానందం, ఎస్సై క్రాంతి కుమార్) వైఖరిపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని కోరుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

దశ, దౌల్తాబాద్: మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఆదేశాల మేరకు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బీజేపీ మండల అధ్యక్షుడు దేవుడి లావణ్యనరసింహారెడ్డి పంపిణీ చేశారు.ముబారస్పూర్ గ్రామానికి చెందిన కొర్రే పర్శరాములుకు రూ.60,000, మోహన్ లాల్ కుటుంబ సభ్యులకు రూ. 60 వేలు, ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ముష్టి నవీన్‌కు రూ.20,500 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముబారస్పూర్ సర్పంచ్ విజయ స్వామి, మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు మీర్గం రమేష్, బోట్కా లక్ష్మన్, మండల ప్రధాన కార్యదర్శి చిక్కుడి స్వామి, బీజేవైఎం మండల అధ్యక్షుడు బుర్ర రోజుగౌడ్, బూత్ అధ్యక్షులు చెంద్రం, చంద్రశేఖర్, కార్యకర్తలు మహేష్, రాములు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ అందుల దినోత్సవం

దశ, తుంగతుర్తి: లూయిస్ బెయిల్ జన్మదిన సందర్భంగా ప్రపంచ అంధుల దినోత్సవాన్ని మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగావెలుగుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దాచేపల్లి వెంకట్ రెడ్డి ,తుంగతుర్తి, తుంగతుర్తి ఎస్సీ కాలనీ కరివిరాల, కొత్తగూడెం అన్నారం, అన్నారం ఎస్సీ కాలనీ, వెలుగు పల్లి ,అన్నారం, కరివిరాల ఉన్నత పాఠశాలల 600 విద్యార్థిని విద్యార్థులకు పెన్నులు మరియు చాక్లెట్ల పంపిణీ చేశారు ఇట్టి కార్యక్రమంలో మండల విద్యాధికారి బోయిన లింగయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి రఘుపతి, గురువయ్య, శ్రీరాములు, పి ఆర్ టి యు టియస్ మండల ప్రధాన కార్యదర్శి పి చంద్రశేఖర్, టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎం సూర్య ప్రకాష్ ,తదితరులు పాల్గొన్నారు.

హామీ ఇచ్చారు..అమలుపరిచారు..

❖ ఆడబిడ్డ పుడితే రెండు వేలు నజరానా

❖ పలువురికి ఆదర్శంగా నిలిచిన మహిళా సర్పంచ్ రెడ్డి సుజాత

దశ, భద్రాద్రి కొత్తగూడెం: ఎన్నికల సమయంలో గెలిచేందుకు అభ్యర్థులు ప్రజలకు అనేక హామీలు ఇస్తుంటారు. గెలిచాక ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ముఖం చాటేసేవారు కొందరైతే మరికొందరు ఇచ్చిన మాటకు కట్టుబడి ఎలక్షన్ సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కృషి చేస్తుంటారు. అలాంటి కోవకు చెందిన వారే మహిళా సర్పంచ్ రెడ్డి సుజాత. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం పెనుబల్లి గ్రామపంచాయతీ నుండి సిపిఐ పార్టీ అభ్యర్థి రెడ్డి సుజాత 350 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. గతంలో ఈమె భర్త రెడ్డి శ్రీనివాస్ ఇదే పంచాయతీ నుండి సర్పంచ్ గా బాధ్యతలు నిర్వహించారు. గత ఐదు సంవత్సరాల్లో చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలు వల్ల గ్రామ ప్రజలు మరొకమారు అత్యధిక మెజార్టీతో రెడ్డి సుజాతను గెలిపించారు. గెలిచాక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. మొదటిగా పెనుబల్లి గ్రామం నుండి స్మశాన వాటికకు సుమారు 400 మీటర్ల పొడవున సిసి రోడ్ నిర్మాణం పనులు ప్రారంభించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మరో హామీ గ్రామంలో ఆడపిల్ల జన్మిస్తే వారికి 2000 రూపాయలు నజరానా ఇస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారంగా గ్రామంలో అరవింద నందిని దంపతులకు ఆడబిడ్డ జన్మించింది అన్న విషయం తెలుసుకున్న సర్పంచ్ సోమవారం వార్డు సభ్యులు సిపిఐ మండల కార్యదర్శి సమక్షంలో 2000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆడబిడ్డకు సర్పంచ్ అందించే ఆర్థిక సహాయానికి ఆకర్షితులైన సిపిఐ మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి సైతం వెయ్యి రూపాయలు అరవింద్ నందిత కుటుంబ సభ్యులకు అందజేశారు.